ప్రజా విశ్వంభర V3 NEWS లక్ష్యం సమాజహితం

ప్రజల భాగస్వామ్యంతోనే అవినీతి నిర్మూలన:డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు



విశ్వంభర, నల్గొండ: ప్రభుత్వ వ్యవస్థలు, ప్రజలు భాగస్వాములై పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే అవినీతిని నిర్మూలించి, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంతో పాటు అవినీతి రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని రాష్ట్ర పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ సభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు.శనివారం సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల భవన్‌లో సమాచార హక్కు చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెరిగితే పాలనలో పారదర్శకతను పెంపొందించడం ద్వారా అవినీతి, అక్రమాలను నియంత్రించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం అమలులో విశిష్ట సేవలు చేసి రాష్ట్ర స్థాయి పురస్కారం పొందిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ గారిని, ఇటీవల జిల్లా పర్యవేక్షణ సంఘ సభ్యులుగా నియమితులైన బైరు సైదులు గౌడ్ మరియు కిషన్ నాయక్‌లను శాలువాతో సన్మానించి అభినందించారు.వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, నేడు సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో అవగాహన తక్కువ స్థాయిలో ఉందని, దీనిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మహాత్మా గాంధీ కలలు సాకారం కావాలంటే సమాచార హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక పాలన అందించే దిశగా పలు చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాచార సంఘం, మానవ హక్కుల సంఘం, లోకాయుక్త, వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మైనారిటీ సంఘాలు, మహిళా సంఘంతో పాటు రాష్ట్ర పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ వంటి సంస్థలను ఏర్పాటు చేసి పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అయితే ఈ లక్ష్యాలు నెరవేరాలంటే ప్రభుత్వం ఒక్కటే కృషి చేస్తే సరిపోదని, ప్రజల భాగస్వామ్యం కూడా తప్పనిసరిగా ఉండాలని అన్నారు.రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులని, ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బుతోనే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు. అందువల్ల ప్రజాధనం ఎలా ఖర్చవుతోంది అనే విషయాలను తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకునే సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని పేర్కొన్నారు.సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెరిగిందని, సామాన్య ప్రజలకు తమ హక్కులపై అవగాహనతో పాటు గౌరవం పెరిగిందని తెలిపారు. నూతన సమాచార సంఘం ఏర్పాటు చేసిన సమయంలో వేలాది కేసులు పరిష్కారం కాకుండా ఉండేవని, వాటిని పరిష్కరించడంతో పాటు ప్రస్తుతం ఉన్న కేసులను కూడా పరిష్కరిస్తున్నామని వివరించారు.జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ,...సమాచార హక్కు చట్టానికి సంబంధించిన వివరాలను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంచాలని, పౌరులు కోరిన సమాచారాన్ని సంబంధిత అధికారులు వెంటనే అందించాలని సూచించారు. చట్ట నిబంధనలను పాటించని అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.సమాచార హక్కు చట్టం అమలులో ఆయన చేసిన విశిష్ట కృషికి రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌ను డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు,దేశాల భూపాల్ గారలు శాలువాతో సత్కరించి అభినందించారు. అదే విధంగా పర్యవేక్షణ సంఘ సభ్యులుగా నియమితులైన బైరు సైదులు గౌడ్ మరియు కిషన్ నాయక్‌లను కూడా సన్మానించారు. సమాచార హక్కు వికాస సమితి అధ్యక్షుడు డాక్టర్ వై. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పించేందుకు రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలలోని సమాచార హక్కు సంస్థలు ఎంతో కృషి చేయాల్సి ఉంటుందన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా అవినీతి, అక్రమాలను నియంత్రించడంతో పాటు పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన పాలనను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో .. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలు వై. హేమలత రాష్ట్ర కమిటీ సభ్యులు గాదె వినోద్ రెడ్డి ఉన్నాం సత్య నారాయణ గంధ మల్ల జయంతు లక్ష్మీ కాంత్ రెడ్డి జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్ చిత్రం శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడుమూరు దయాకర్ రావు సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షులు గుంతకండ్ల ముకుంద రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఖేల్ మహోత్సవ్ వేడుకలు

విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత: డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



విశ్వంభర, హుస్నాబాద్: ఆల్ఫోర్స్ హైస్కూల్, హుస్నాబాద్‌లో శనివారం ఆల్ఫోర్స్ ఖేల్ మహోత్సవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించి, క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు.విద్యార్థుల అద్భుతమైన కవాతు, క్రీడా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా చైర్మన్ గారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆల్ఫోర్స్ సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించి, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తి, ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మహాత్మా జ్యోతిరావు పూలే కు ఘన నివాళులు



విశ్వంభర, త్రిపురారం: త్రిపురారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెన్నైపాలెం స్కూల్ కాంప్లెక్స్ లో శనివారం సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 136 లో వర్ధంతి సందర్భంగా త్రిపురారం, నిడమానూరు మరియు మాడ్గులపల్లి మండలాల సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో మహాత్మా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగాని వాళులర్పించారుఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నాయిపాలెం స్కూలు కాంప్లెక్స్ చైర్మన్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిసైదిరెడ్డి మాట్లాడుతూ... భారతదేశంలో సమసమాజ నిర్మాణం కోసం సామాజిక దురాచారాల నిర్మూలన కోసం, మహిళా చైతన్యం కోసం తన జీవితాంతం కృషిచేసిన గొప్ప మహోన్నతుడు సంఘ సంస్కర్త మహాత్మా పూలే అని ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తి దాయకం అని అన్నారు.ఔ కార్యక్రమంలో సోషల్ స్టడీస్ రిసోర్స్ పర్సన్స్ పులిపాటి సత్యనారాయణ, బొమ్మరబోయిన సైదయ్య, శ్రీనివాస్ రెడ్డి,చల్లా రవి, కిరణ్ కుమార్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే



విశ్వంభర, మిర్యాలగూడ: మహాత్మా జ్యోతిరావు పూలే గారి 136వ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి గారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు.అనంతరం మిర్యాలగూడ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విగ్రహ పాదాలను పాలతో శుద్ధి చేసితమగౌరవాభిమానాలను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష,నవీన్, పట్టణ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. *సమాజంలో సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు.

161వ జాతీయ రహదారిపై వంతెన పై రెండు డివైడర్ల మధ్యన ఇరుక్కున్న లారీ.. తప్పిన ప్రమాదం



విశ్వంభర, పెద్ద శంకరంపేట: 161వ జాతీయ రహదారిపై పెద్ద శంకరంపేట పట్టణ సమీపంలోని తిరుమలపూర్ వంతెన పై రెండు డివైడర్ల మధ్యన లారీ ఇరుక్కు పోయిన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.. వివరాల్లోకి వెళితే గుజరాత్ నుండి హైదరాబాదుకు టైల్స్ లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్ర మబ్బులో లారీ నడుపుతుండంతో డివైడర్ను ఢీకొని తిరుమలాపూర్ వంతెన పై రెండు డివైడర్ల మధ్యన ఇరుక్కుపోయింది.. ఈ సమయంలో వంతెన కింద రహదారిపై ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పిపోయింది. .దీంతో లారీ ముందు బాగానే ఉన్న రెండు టైర్లు కిందపడ్డాయి.. ఈ ఘటనలో లారీ డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి.. వంతెన కింద వాహనాలు కానీ వ్యక్తులు కూడా ఎవరూ లేకపోవడంతో ఇలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ఒక సారిగా రెండు డివైడర్ల మధ్యన లారీ ఇరుక్కు పోవడంతో పెద్ద శంకరంపేట తో పాటు పరిసర ప్రాంత గ్రామ ప్రజలు లారీని తిలకించడానికి వచ్చారు. పేట ఏఎస్ఐ సంగమేశ్వర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు...

కేజీబీవీల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, దోర్నకల్, బయ్యారం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను (కేజీబీవీ) జీసీడీవో విజయలక్ష్మి తనిఖీ చేశారు. రానున్న పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని, విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు.ఈ సందర్భంగా ఆయా కేజీబీవీల్లో విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, పాఠ్యాంశాల పూర్తిస్థాయి అమలు, పరీక్షల సన్నద్ధత తదితర అంశాలను పరిశీలించారు. నిర్ణీత విద్యా ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను పూర్తిచేసి, విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు తరగతుల వారీగా పునశ్చరణ నిర్వహించాలని తెలిపారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించే విధంగా బోధన సాగించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రతిరోజూ చదువుకు సంబంధించిన ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని, పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా సానుకూల వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ, ప్రతి విద్యార్థి పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యేలా ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం కేజీబీవీల్లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, పాఠశాల నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, విద్యా సంబంధిత రికార్డులు, ఇతర నిర్వహణ పత్రాలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పాఠశాల పరిపాలనలో పారదర్శకత, క్రమశిక్షణ పాటిస్తూ అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. విద్యార్థులకు అందించే వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ స్టోర్ గది, వంటగది (కిచెన్), తరగతి గదులను పరిశీలించారు.స్టోర్ గదిలో నిల్వ ఉంచిన వస్తువులు, సరుకులను సక్రమంగా నిర్వహించాలని, వంటగదిలో పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. వంటగది, ఆహార పదార్థాల నిల్వ ప్రదేశాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.తరగతి గదులను పరిశీలిస్తూ విద్యార్థులకు అనుకూలమైన బోధనా వాతావరణం కల్పించాలని, గదులు శుభ్రంగా, క్రమబద్ధంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కేజీబీవీలలో విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, క్రమశిక్షణ, భద్రత వంటి అంశాల్లో తగిన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు.ప్రభుత్వం బాలికల విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కేజీబీవీల ద్వారా విద్యార్థులకు విద్య, వసతి, భోజనం తదితర సదుపాయాలను కల్పిస్తోందని, ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని జీసీడీవో విజయలక్ష్మి సూచించారు.రానున్న పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా సమన్వయంతో పనిచేయాలని,పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఆమె తెలిపారు.

రేవంత్ రెడ్డికి బీజేపీని విమర్శించే హక్కు లేదు

సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విట్టల్



విశ్వంభర, పెద్ద శంకరంపేట : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బిజెపిని విమర్శించే హక్కు లేదని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విట్టల్ అన్నారు. శనివారం పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 8 మంది ఎంపీలు 8 మంది ఎమ్మెల్యేలు ముగ్గురు ఎమ్మెల్సీలు భారతీయ జనతా పార్టీ నుండి గెలుపొందిన వారు ఉన్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో సైతం భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఈ విధంగా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని అన్నారు. బీజేపీ ఎక్కడుందో ఎన్నికల ఫలితాలే సమాధానం చెబుతాయని, ముందుగా కాంగ్రెస్ ప్రభుత్వంలోని అంతర్గత సమస్యలు, ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పేట మండల బీజేపీ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, బీజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ, నాయకులు బోలా శంకర్,అంజయ్య.. ధ్రువ కుమార్ సుకుమార్ .. ఆతదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశంలో పాల్గొన్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

విశ్వంభర,సూర్యాపేట: వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండా సురేఖ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండా మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ గారు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పొలగాని బాలు గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ నాగుల వాసు, చివ్వెంల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధారావత్ వీరన్న నాయక్ పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్ భూమిలో అక్రమ మట్టి తవ్వకాలు

కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

తహశీల్దార్‌కు కార్యాలయంలో 6వ వార్డు ముస్లింలు వినతి

విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు, బేతోలు రెవెన్యూ పరిధిలోని వెంకటేశ్వర గుట్ట (బోర్డు) వద్ద ఉన్న ముస్లిం ఖబ్రస్తాన్ (స్మశాన వాటిక) భూమిలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ స్థానిక ముస్లింలు శనివారం మహబూబాబాద్ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా, మాట్లాడుతూ.. సర్వే నంబర్ 78లోని సుమారు 7 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిలో, ఒక ఎకరం విస్తీర్ణంలో ఎన్నో ఏళ్లుగా ఖాదర్ బాబా దర్గా, ముస్లిం ఖబ్రస్తాన్ కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల యూడీఎఫ్ నిధుల కింద మెయిన్ రోడ్డు నుండి స్మశానవాటిక వరకు మెటల్ రోడ్డు నిర్మాణ పనులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అయితే, ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా స్మశానవాటిక స్థలంలో జేసీబీ సహాయంతో అక్రమంగా మట్టిని తవ్వుతూ తరలించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.స్మశానవాటిక పవిత్రతను దెబ్బతీస్తూ జరుగుతున్న ఈ తవ్వకాలను గమనించిన స్థానిక ముస్లింలు, కాలనీవాసులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకుని జేసీబీని నిలిపివేశారు. అధికారులు తక్షణమే స్పందించి ఖబ్రస్తాన్ భూమిలో తవ్వకాలను పూర్తిగా నిలిపివేయాలని, భూమిని సర్వే చేయించి సరిహద్దులు నిర్ధారించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన సదరు కాంట్రాక్టర్‌పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు స్థానిక ముస్లిం నాయకులు, కాలనీవాసులు ఎస్‌కే యూసుఫ్, ఎస్‌కే ఖాదర్ బాబా, ఎస్‌కే జావీద్, ఎస్‌కే హుమాయూన్, ఎస్‌కే సోహెల్, ఎస్‌కే గౌస్, ఎస్‌కే ఇమ్రాన్, ఎస్‌కే షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విశ్వంభర, మోత్కూర్: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలంలోని పాటిమట్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవా కమిటీ,(ఎం ఎల్ ఎస్ సి)రామన్నపేట ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మిరియాల దామోదర్,అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి . సత్యయ్య , సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్, రామన్నపేట పాల్గొని విద్యార్థులే నిజమైన దేశ సంపద అన్నారు.ముఖ్యంగా మాదకద్రవ్యాల నివారణ మరియు అవగాహన ఆరోగ్యకరమైన జీవన విధానం పోక్సో చట్టం , యాసిడ్ దాడుల నివారణ, బాలల రక్షణ హక్కులు (చిల్డ్రన్ ప్రొటెక్షన్) మరియు బాల్యవివాహాల నిరోధం వంటి అంశాలపై వివరంగా ప్రసంగించారు.ఈ సందర్భంగా..... విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిస కాకుండా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. బాలలపై జరిగే లైంగిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ మధ్య తేడాలను తెలుసుకోవాలని, ఏదైనా అన్యాయం లేదా వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాలల హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించి పరిరక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ కె. శ్రీనివాస్ , అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎస్. శ్రవణ్ కుమార్, న్యాయవాది బి. దేవిడ్, సి డబ్ల్యూ సి మెంబర్ కునగళ్ల మల్లేశం ,లీగల్ సర్వీస్ ప్రతినిధి కురిమేటి యాదయ్య, అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రతినిధి కానుగంటి శ్రీశైలం, స్థానిక సర్పంచ్ బండ రామా విజయ్ రెడ్డి,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏ ఏ పి సిచైర్మెన్, అంగన్వాడి టీచర్ ,విద్యార్థిని,విద్యార్థులు మరియు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



విశ్వంభర,పెద్దశంకరంపేట: అయ్యప్ప పడిపూజ హైదరాబాదులోని సతీష్ చారి గురుస్వామి ఇంటి ఆవరణలో ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. పెద్ద శంకరంపేట పట్టణానికి చెందిన అన్నారం సతీష్ చారి గురుస్వామి హైదరాబాదులోని మదినగూడ లో నివాసం ఉంటున్నారు గత 15 సంవత్సరాలుగా అయ్యప్ప మాల ధరిస్తూ ఆధ్యాత్మిక వైపు కొనసాగుతూ తన వృత్తి ధర్మాన్ని క్రమం తప్పకుండా పాటిస్తూ సమాజ సేవలో తన వంతు పాత్రను పోషిస్తున్న సతీష్ చారి శనివారం పడి పూజను భక్తిశ్రద్ధలతో జరిపారు. గురుస్వాములు బాయికాడి రామన్న రాములు శ్రీహరి సాయిరాం సుధీర్ చంద్ర సురేంద్ర జనార్దన్ గౌడ్ రామకృష్ణ గురుస్వాముల తో పాటు కన్నె కత్తి గదా పెరుస్వాములు కూడా ఈ పూజలో పాల్గొన్నారు నర గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రామకృష్ణ స్వామి, దేవేందర్ ప్రశాంత్ నిజన రమేష్ స్వామి రాజు స్వామి అంజి స్వామి తదితరులున్నారు.

డా. వెంకటరత్నంకు నివాళిగా ఉచిత కంటి వైద్య శిబిరం



విశ్వంభర, కొత్తగూడ: వైద్యం వ్యాపారంగా మారుతున్న నేటి రోజుల్లో.. వైద్యసేవనే జీవిత ధ్యేయంగా భావించి,కనీస సౌకర్యాలు సైతం లేని రోజుల్లో మారుమూల ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అపూర్వమైన వైద్యసేవలు అందించిన ప్రజావైద్యుడు డా. వెంకటరత్నం సేవలు చిరస్మరణీయం. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా.. మూడు దశాబ్దాలు గడిచినప్పటికీ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారనడానికి ఆయన స్మారకార్థం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి లభించిన స్పందనే నిదర్శనం...దివంగత డా. వెంకటరత్నం స్మారకార్థం శనివారం సూర్య స్వచ్ఛంద సంస్థ సహకారంతోఓటాయి గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. తొలుత డా.వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి పాలడుగు రేణుకాదేవి శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సారంగపాణి మాట్లాడుతూ.. వైద్య సదుపాయాలు అంతంత మాత్రంగా ఉన్న కాలంలోనే మారుమూల కొత్తగూడ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నిస్వార్థంగా, అంకితభావంతో వైద్యసేవలు అందించిన మహనీయుడు డా. వెంకటరత్నం అని కొనియాడారు. ఆయన మరణించి 30 ఏళ్లు గడిచినా నేటికీ ప్రజలు ఆయనను స్మరించుకుంటున్నారంటే, సమాజానికి ఆయన అందించిన సేవల విలువ ఎంత గొప్పదో అర్థమవుతుందన్నారు. పదవులు, పేరు ప్రతిష్టల కంటే ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చిన ఆయన సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కాగా, ఈ శిబిరంలో సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 50 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరందరికీ సోమవారం మహబూబాబాద్‌లోని సూర్య కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు మాధవరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ధనసరి జ్యోతి, రేణ్య తండా సర్పంచ్ మాలోత్ లక్ష్మీ రావోజీ, వార్డు సభ్యులు ఎరుకల రాజకుమార్, తగిడి సరిత, చింత సరిత, గ్రామ పెద్దలు జండా రామారావు, బుగ్గల కొమురయ్య, చింత అనిల్ తదితరులు పాల్గొన్నారు